www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 11 జూన్ 2023

5

పశ్చిమ గోదావరి



తాడేపల్లిగూడెం కమిషనర్‌గా శామ్యూల్



తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా డాక్టర్ అనపర్తి శామ్యూల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ శామ్యూల్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి పట్టణ పారిశుధ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రయినేజీల్లో పూడికతీత పనులు వేగవంతం చేసి వాటిని ఔట్‌లెట్ డ్రయినేజీలకు అనుసంధానం చేయాలని సూచించారు. పారిశుధ్య అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కమిషనర్ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.

కౌలు రైతులపై

కనికరం లేదాయే..!

కౌలుకార్డుల జారీ ప్రక్రియలో తీవ్ర నిర్లక్ష్యం


ప్రచారం, గ్రామసభలు అన్నింటికీ తిలోదకాలు

నోరుమెదపని వ్యవసాయశాఖ జిల్లా అధికారులు

రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు

భూయజమాని అంగీకారం నిబంధన పేరుతో కొర్రీలు

ప్రభుత్వం, అధికారుల తీరుపై అన్నదాత ఆగ్రహం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుల బాగోగులు చూడాల్సిన వ్యవసాయశాఖ మొద్దునిద్రలో జోగుతోంది. రైతుల గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో వ్యవసాయసాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఖరీఫ్ సాగు ఆరంభమవుతున్నా ఇప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ తూతూమంత్రంగా అన్నట్లు తయారైంది. భూయజమాని అంగీకారం ముసుగులో కౌలురైతుల బతుకులకు కొర్రీలు వేస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది.

రైతే దేశానికి వెన్నెముక.. మాది రైతు ప్రభుత్వం అంటూ ఊదరగొడుతున్న పాలకులు రైతుల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొంది. రైతుల బాగోగులు చూడాల్సిన వ్యవసాయశాఖ అధికారులు ఎసి గదులకు పరిమితమవుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం జిల్లాలోని కౌలురైతులకు పెనుశాపంగా మారింది. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో వ్యవసాయ సాగు 70 శాతానికిపైగా కౌలురైతులే చేస్తున్నారు. ప్రతియేటా ఏప్రిల్ రెండో వారంలో కౌలుకార్డులు (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ ప్రారంభించేవారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహించడం, గ్రామసభలు పెట్టి రైతులకు అవగాహన కల్పించడం వంటి చర్యలను వ్యవసాయ, రెవెన్యూశాఖలు చేపట్టేవి. ఈ ఏడాది కౌలుకార్డుల ప్రక్రియను తూతూమంత్రం అన్నట్లు తయారైంది. కౌలుకార్డుల ప్రక్రియపై ఇప్పటి వరకూ వ్యవసాయశాఖ జిల్లా అధికారులు నోరుమెదపని పరిస్థితి ఉంది. గతంలో కౌలుకార్డుల జారీ ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసినప్పుడు, రైతులకు అవగాహన కల్పించే ప్రక్రియలో భాగంగా మీడియాకు వివరాలిచ్చేవారు. కౌలుకార్డుల ప్రక్రియపై ఏం జరుగుతుందో, ఇప్పటి వరకూ ఎన్ని కౌలుకార్డులు జారీచేశారు, ఎన్ని దరఖాస్తులు వచ్చాయి వంటి వివరాలేవీ మీడియాకు చెప్పని పరిస్థితి నెలకొంది. తమ అలసత్వం బయటపడుతుందనే ఆలోచనతో మీడియాకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు. ఒకవేళ ఫోన్ చేసినా సమాధానం చెప్పే పరిస్థితి ముఖ్యంగా ఏలూరు జిల్లాలో లేకుండాపోయింది. జిల్లా వ్యవసాయ శాఖాధికారులు తమకు రైతులతో ఏమాత్రం సంబంధం లేదన్నట్లు, నియంతల మాదిరిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖాధికారులే రైతుల గురించి ఆలోచించకపోతే ఇక అన్నదాత పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. ఇప్పటి వరకూ పదిశాతం మాత్రమే కౌలుకార్డుల జారీ జరిగినట్లు తెలుస్తోంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ వేగవంతంపై జిల్లా కలెక్టర్లు చొరవ చూపకపోతే అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

భూయజమాని అంగీకారం ముసుగులో కొర్రీలు

వైసిపి ప్రభుత్వం వచ్చాక 2019 భూసాగుదారు హక్కుచట్టం పేరుతో 2011లో వచ్చిన కౌలురైతుల చట్టంలో మార్పులు చేసింది. భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ చేయాలని నిబంధన విధించింది. భూయజమానులకు వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు అవగాహన కల్పించి కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేస్తారని పేర్కొంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. భూయజమాని అంగీకరించడం లేదనే కారణంతో కౌలురైతులకు కార్డులు ఇవ్వడం లేదు. దీంతో పంట నష్టపరిహారం, బీమా, రైతుభరోసా వంటి ఏఒక్క ప్రభుత్వ సాయం కౌలురైతులకు అందడం లేదు. భూయజమానులకు అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తెచ్చిన భూయజమాని అంగీకారం నిబంధన కౌలురైతులకు ఉరితాడు మాదిరిగా తయారైంది. జారీ చేస్తున్న కౌలుకార్డుల్లో చాలావరకు బోగస్ అంటూ విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. భూయజమాని బంధువులకు కార్డులు జారీ చేసి లెక్కలు చూపిస్తున్నారనే చర్చ సాగుతోంది. ఇప్పటికైనా కౌలురైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుసంఘాలు కోరుతున్నాయి.

భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులివ్వాలి

ఎ.హరేరాం, ఏపి రైతుసంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి

గ్రామసభలు నిర్వహించాలి. ఏఆర్ఒ, వ్యవసాయాధికారి, వాలంటీర్లతో పరిశీలన చేసి అర్హులైన కౌలురైతులందరికీ భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేయాలి. ఓటుహక్కు మాదిరిగా అర్హులైన ప్రతి కౌలురైతుకూ కౌలుకార్డు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. పంట రుణం, పంట నష్టపరిహారం, బీమా వంటివి కౌలురైతులు పొందేవిధంగా కౌలుకార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలి.

మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా కొనసాగిన దీక్షలు



దీక్షకు మద్దతు తెలిపి నినదిదిస్తున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడలోని గోదావరి పెరుగులంక భూముల్లో మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరాయి. ఈ దీక్షా శిబిరాన్ని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల మహాజన సోషలిస్టు పార్టీ ప్రచార కార్యదర్శి పసుపులేటి చినబాబు మాట్లాడుతూ చించినాడలో దళితుల భూముల్లోని మట్టిని దౌర్జన్యంగా వైసిపి నేతలు బయట వ్యక్తులకు లక్షలాది రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అడ్డు వచ్చిన దళితులపై పోలీసులచే లాఠీఛార్జీ చేయించి విచక్షణారహితంగా కొట్టించి గాయపరచడం చూస్తే అధికార పార్టీ నేతలకు మానవత్వం ఉందా అని అన్పిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెరుగులంక భూముల నుండి మట్టి తవ్వకాలను ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో చించినాడ గ్రామంలో భారీ బహిరంగ సభ నిర్వహించి తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పలివెల పైడియ్య, బాలం వెంకటేశ్వరరావు, మంద చిన్న, కపాల పెద్దిరాజుతోపాటు సిపిఎం నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండలు, మురాల రాజేష్, విప్పర్తి నన్ని, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

14.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

ధాన్యానికి బోనస్ ఇవ్వట్లేదనే తప్పుడు ప్రచారం సరికాదు

నూతన కొనుగోలు విధానంతో ఎకరానికి రూ.9 వేలు రైతులకు మిగులు

వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 17,94,279 మంది రైతుల నుంచి రెండు కోట్ల 65 లక్షల 10,747 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో 32,76,354 మంది రైతుల నుంచి మూడు కోట్ల 10 లక్షల 56,117 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.58,739 కోట్లు ఖర్చు చేసిందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక విష్ణు కళాశాల అతిథిగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కారుమూరి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థ లేకుండా చేయడంతోపాటు కనీసం మద్దతు ధర ఇచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. హమాలీలు, వాహనాల కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. రబీ సీజన్లో 1,57,556 మంది రైతుల నుండి 14,04,026 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. దీనికి రూ.2,865 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,44,741 మంది రైతులకు రూ.2,651 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలో జమ చేస్తామని తెలిపారు. ధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో బోనస్ ఇస్తున్నారని, మన రాష్ట్రంలో ఇవ్వట్లేదని అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో హమాలీలు, రవాణా, గోనె సంచుల ఖర్చు అంతా ప్రభుత్వమే భరించి ఎకరాకు రూ.9 వేలు రైతులకు మిగులుస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దళారీ వ్యవస్థను ప్రోత్సహించిందన్నారు. తాము దళారీ వ్యవస్థ లేకుండా రైతుల ఖాతాలకు డబ్బు జమ చేశామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

వచ్చే ఏడాది పోలవరం జాతికి అంకితం చేస్తాం

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన పోలవరం ప్రాజెక్టును ఆయన కుమారుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం పనులు పూర్తి చేసి ఏప్రిల్‌లో నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టును చూసేందుకు అనుమతులు తీసుకుని ఎవరైనా వెళ్లొచ్చన్నారు. టిడిపి నేతల తీరు సరిగా లేదన్నారు.

మట్టి తోలకాన్ని అడ్డుకోవడం సరైంది కాదు

పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లోకి మట్టిని తోలనీయకుండా పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అడ్డుకోవడం సరైంది కాదని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంఎల్‌ఎ రామానాయుడు మట్టి తోలకాల్లో లక్షలు సంపాదించారని చెప్పారు. ఎంఎల్‌ఎ ప్రసాద్‌రాజుకు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌కు పేరొచ్చేస్తుందని వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మట్టి జగనన్న కాలనీకి కాకుండా ప్రయివేట్ వ్యక్తులకు వెళ్తుందని లారీలను పట్టుకున్నారుగా అని విలేకరులు ప్రశ్నించగా 'ఆ లారీలను కూడా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఏర్పాటు చేసి అడ్డుకుని ఉండొచ్చు.. నీకు నాకు ఏమైనా తెలుసా', ఎంఎల్‌ఎ నిమ్మల ఓ పెద్ద డ్రామానాయుడు అని విమర్శించారు. జిల్లాలో వారాహి యాత్ర నిర్వహణపై విలేకరులు మంత్రిని ప్రశ్నించగా ఎవరైనా ఎటువంటి యాత్రలైనా చేసుకోవచ్చన్నారు.

జగన్ ప్రభుత్వానికి ప్రజల షాక్ తప్పదు

ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు


ప్రజాశక్తి - కాళ్ల

పెంచిన కరెంట్ ఛార్జీలే రానున్న రోజుల్లో ప్రజలు జగన్ ప్రభుత్వానికి పెద్ద షాక్ ఇవ్వబోతున్నాయని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లోఓల్టేజీ కారణంగా ఆక్వా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 2014కు ముందు కరెంట్ కొరతతో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తన ముందుచూపు, ఆలోచనా విధానాలతో కరెంట్ కొరతను తగ్గించారన్నారు. ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 24 గంటలూ విద్యుత్ అందించారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి రికార్డు సృష్టించిందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా కరెంట్ బిల్లులు కట్టకుండా ఉద్యమిద్దామంటే ఒక నెల బిల్లు కట్టకపోతే ఫ్యూజులు పీకేస్తున్నారన్నారు. త్వరలో జగన్ పాలనకు ప్రజలు చరమగీతం పాడటం ఖాయమన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండి

స్థానిక ఎన్‌ఆర్‌పి అగ్రహారంలో వైసిపి జిల్లా కార్యాలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు దంపతులు భూమి పూజ నిర్వహించగా వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసిపి జిల్లా అధ్యక్షులు చెరుకువాడ రంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి జిల్లా కార్యాలయాన్ని సరికొత్త హంగులతో నాణ్యతతో త్వరితగతిన నిర్మించబోతున్నామని, 2024 ఎన్నికలకు ఈ కార్యాలయం వేదిక కాబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సంచార జాతుల కార్పొరేషన్ ఛైర్మన్ పెండ్ర వీరన్న, ఎంఎల్‌ఎలు గ్రంధి శ్రీనివాస్, ముదునూరి ప్రసాద్‌రాజు, పుప్పాల శ్రీనివాస్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొడుతున్న మిథున్‌రెడ్డి

ప్రభుత్వం, అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

పేదలు ఇళ్ల స్థలాలివ్వాలని కోరితే గ్రామంలో ఖాళీ స్థలాలు లేవని చెప్పిన అధికారులు గ్రామానికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో సరైన సదుపాయాలు లేనిచోట్ల స్థలాలు కేటాయించి చేతులు దులుపుకున్నారు. అయితే స్థలాలు లేవన్న గ్రామంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఉన్న 72 సెంట్లు భూమిని వైసిపి జిల్లా కార్యాలయ నిర్మాణానికి ఎలా కేటాయించారని, అప్పుడు లేదన్న భూమి ఇప్పుడెలా వచ్చిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో ఉపాధి హామీ క్షేత్రస్థాయి పరిశీలకురాలిగా పని చేస్తున్న వై.దేవిని విధుల నుంచి తొలగిస్తూ ఉపాధి హామీ సంచాలకులు టివి.రాజేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా దేవిని ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించినట్లు సాంకేతిక సహాయకుడు జైబాబు శనివారం తెలిపారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ దంపతులు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజును మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. పెదఅమిరంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ క్యాంపు కార్యాలయానికి వారు విచ్చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ గంటా పద్మశ్రీ దంపతులను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పి.శిరీషవిశ్వనాథరాజు, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచి జవ్వాది కిషోర్, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పి.దుర్గాప్రసాదరాజు, వైసిపి నాయకులు సాగిరాజు హరివర్మ, నడింపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.



జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులను సత్కరిస్తున్న పివిఎల్

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

డిఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి - వీరవాసరం

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిఇఒ ఆర్.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. రాయకుదురులోని హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. నాడు-నేడు పనులను పరిశీలించి పాఠశాలలు తెరిచే నాటికి రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జగనన్న విద్యాకానుక కిట్లు నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందజేసేలా సిద్ధం చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పండుగ వాతావరణంలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీరాస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఇఒ వెంకటరమణ

ముంపు ఆధారంగా పరిహారమివ్వాలి


పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం 'పోరుకేక'ను విజయవంతం చేయాలి

కుక్కునూరు: 1986, 2022లో వచ్చిన గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకుని కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రతినిర్వాసితుడికీ పూర్తి పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతున్న వారికి పూర్తి స్థాయిలోపరిహారం, పునరావాసం చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో వెయ్యి మందితో ఈ నెల 20న ఆల్లూరి జిల్లా నెల్లిపాకలో పాదయాత్ర ప్రారంభించి వచ్చేనెల ఏడో తేదీ వరకూ 400 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ రాష్ట్ర రాజధాని అమరావతిలో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు పాల్గొంటారని ముగింపు సభకు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే ప్రాజెక్టు కోసం నిర్వాసితులు సర్వం త్యాగం చేస్తుంటే వారికి పరిహారం, పునరావాసం కల్పించకుండా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కమిటీ సభ్యులు కిషోర్, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, జీవరత్నం, నాయకులు మడివి దుర్గారావు, వెంకట్రావు, మహబూబ్ పాషా పాల్గొన్నారు.


దొరికినా.. దొరలే..!

'దొరికితేనే దొంగలు.. దొరక్కపోతే దొరలే' అనే చందానికి ప్రస్తుత కాలం చెల్లింది. అదేమిటీ అర్థం మారిందా అనుకుంటే తప్పులో కాలేసినట్లే. మన రాష్ట్రంలో పాలకులు, అధికార పక్ష నేతలే దాని అర్థం మార్చేశారు. దొరక్కపోతేనే కాదు.. దొరికినా తాము దొరలమేనని బాహటంగా మాట్లాడటమే కాకుండా చేతల్లో సైతం చూపుతున్నారు. దీనికి నిదర్శనం పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడలోని గోదావరి పెరుగులంక భూముల నుంచి మట్టి తవ్వకాలే. ఏనుగువానిలంక, చించినాడ రెవెన్యూ పరిధిలోని గోదావరి లంక భూముల్లో పేదలు సాగు చేసుకుంటుండగా నాడు ప్రభుత్వం వారికి పట్టాలిచ్చింది. వాటిని పేదలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. తర్వాత కాలంలో గోదావరికి వరదలు వచ్చినప్పుడు ఒక్కోసారి పైనుంచి వచ్చిన మట్టి లంకలను ఆనుకుని ఉండటంతో లంకలు విస్తరించడం సహజం. ఇది ప్రకృతి సిద్ధంగా చూసినా లంక భూములు కోతకు గురికాకుండా కొత్తగా ఏర్పడిన పెరుగులంకలు కాపాడుతుంటాయి. ఇవే లేకపోతే లంక భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఆ పెరుగులంక భూములను సైతం పేదలు బాగు చేసి సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ భూములపై అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కన్ను పడింది. దీంతో ఆ భూముల్లో మట్టి తవ్వకానికి వ్యూహాలు రచించి అధికారులను రంగంలోకి దించారు. నరసాపురం నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్ల పూడికకు మట్టి తోలకం పేరుతో తవ్వకాలు ప్రారంభించారు. ఇదేమిటీ..ఈ భూములను తాము సాగు చేసుకుంటున్నాం కదా అని పేదలు మండల, జిల్లాస్థాయి అధికారులను సైతం కలిసి వినతిపత్రాలు అందించారు. వివిధ రూపాల్లో ఆందోళనలు సైతం చేశారు. అయినా కదలిక లేని పెద్దలు తమ తవ్వకాల జోరు మాత్రం కొనసాగించారు. దీంతో కోర్టును ఆశ్రయించగా లంకల్లో తవ్వకాలను ఆపాలని స్టే సైతం ఇచ్చింది. అధికారపక్షమే అండగా ఉండగా తమకేమిటీ అనుకున్నారో.. లేదా తాము చెప్పిందే చట్టం.. కోర్టులేం చేస్తాయని అనుకున్నారో అధికారుల పర్యవేక్షణలో తవ్వకాలు మాత్రం ఆగలేదు. ఈ దశలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆ ప్రాంతాన్ని సందర్శించి పోలీసులను, యంత్రాల సిబ్బందిని గట్టిగా హెచ్చరించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు పట్టుదలకు పోయి అధికారులపై ఒత్తిడి తెచ్చి మళ్లీ తవ్వకాలను ప్రారంభించారు. అడ్డుకోబోయిన సిపిఎం నేతలు, పేదలను అరెస్టు చేసి సుదూర ప్రాంత పోలీసు స్టేషన్లకు తరలించి తర్వాత విడిచిపెట్టారు. అయినా తవ్వకాలు ఆపకపోవడంతో పేదలు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన రంగప్రవేశం చేయడంతో పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి గణపవరం పోలీసు స్టేషన్‌కు తరలించడం, ఈ సందర్భంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోబోయిన సిపిఎం నేతలు, పేదలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీలు ఝుళిపించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అవి ప్రభుత్వ భూములని, సర్వే నెంబర్లు లేవని పొంతన లేకుండా మాట్లాడి మట్టిపై వచ్చే ఆదాయంపై అవగాహన తప్ప సమస్యపై లేదని చెప్పకనే చెప్పారు. పేదల ఇళ్లకు మట్టి తరలిస్తుంటే అమ్ముకుంటున్నారు, వ్యాపారం చేస్తున్నారు అంటారా అని మరో ప్రజాప్రతినిధి సైతం బీరాలు పలికారు. అయితే శుక్రవారం మేడపాడులో అసలు విషయం బట్టబయలైంది. ఇటుకబట్టీలకు ఒక్కో లారీ మట్టి రూ.పది వేలకు అమ్ముకుంటున్నారంటే వైసిపి నేతల మట్టి దందా ఏస్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై అధికారులు సైతం ఏం చేయాలో అర్థం కాక ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తవ్వకాలను ఆపేందుకు కృషి చేస్తామని, పట్టాలు సైతం ఇచ్చేందుకు ప్రయత్నిస్తామంటూ ఉపశమన మాటలు చెప్పి పేదలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అదెంత వరకూ కార్యరూపం దాల్చుతుందో దొరల పాలనలో సందేహాస్పదమే. అయితే ఆ లారీని ఎంఎల్‌ఎ రామానాయుడే పెట్టి ఉండొచ్చంటూ మంత్రి కారుమూరి వ్యాఖ్యలు విస్మయం కల్గిస్తున్నాయి. పైగా అక్కడేం జరిగిందో నీకు.. నాకు తెలియదుగా అని విలేకరులను ప్రశ్నించడం గమనార్హం. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి. అక్కడేం జరిగిందో తెలియని వారు దానిపై మాట్లాడేందుకు ఎలా అర్హులవుతారు. అదీ ఒక మంత్రి తెలియకుండా వ్యాఖ్యానించడమంటే ప్రభుత్వ పరువు బజారున పడినట్లేగా. చించినాడలో మట్టి తవ్వకాలపై మొన్న ఎంఎల్‌సి, నిన్న మంత్రి వ్యాఖ్యలు అధికార పార్టీ పరువును బజారున పడేశాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

చించినాడలో పెరుగులంక భూములు ఉన్నది కేవలం 15 ఎకరాలే. చించినాడ ఎగువన గోదావరి పరివాహక ప్రాంతంలో పెరుగులంక భూములు పెద్దసంఖ్యలో పెద్దల అధీనంలో ఉన్నాయి. పేదల మీద నిజంగా ప్రేమ ఉంటే ఇక్కడ పేదలను ఇబ్బంది పెట్టకుండా పెద్దల అధీనంలో ఉన్న భూముల్లో మట్టిని తవ్వి జగనన్న ఇళ్లకు చేరవేస్తే ప్రతిఒక్కరూ అభినందిస్తారు. అలాకాకుండా చించినాడలోనే తవ్వకాలంటే పేదలపై ఈ ప్రభుత్వానికి కక్ష తప్ప.. కారుణ్యం లేదని స్పష్టమవుతోంది. మరోపక్క పర్యావరణానికి విఘాతం కల్గించేలా, వరదలు ముంచెత్తేలా తవ్వకాలు సాగించకూడదు. ఏటిగట్టుకు రక్షణ కల్పిస్తూ లంక భూములు కోతకు గురికాకుండా కాపాడే పెరుగులంక భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఉందనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. గోదావరి ఉధృతికి నరసాపురంలో గట్టు కోతకు గురై పట్టణాన్ని వరద ముంచెత్తే పరిస్థితి గత సంవత్సరం ప్రత్యక్షంగా అంతా చూశాం. దీనిలో ఈ ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులు సైతం ఉన్నారు. ఇప్పుడు చించినాడ పెరుగులంక సైతం కోత బారిన పడుతోంది. ఈ క్రమంలో మట్టి తవ్వకాలతో అది మరింత ఉధృతమై పెనుప్రమాదమే పొంచి ఉంది. రాజకీయ కారణాలు, సంపాదన పక్కన పెట్టి ప్రభుత్వ పెద్దలు, పర్యావరణం, చట్టం, పేదలు అనే కోణంలో జిల్లా అధికారులు ఆలోచన చేసి ఇప్పటికైనా మట్టి తవ్వకాలను ఆపితే తాము బాధ్యతలు తీసుకున్నప్పుడు చేసిన ప్రమాణాలకు విలువ ఉంటుంది. లేనిపక్షంలో ఇప్పటికే ఎంఎల్‌సి, మంత్రి వ్యాఖ్యలు, మేడపాడు ఘటనతో పోయిన పరువుతోపాటు రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వ పెద్దలకు బుద్ధి చెప్పి, ఆపై వారికి వత్తాసు పలికిన వారికి అక్షింతలు వేయిస్తారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.




-విఎస్ఎస్‌వి.ప్రసాద్


శ్రీరంగనాథరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భాస్కర్

ఆర్అండ్బి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్బి రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆర్అండ్బి క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ, జివి.భాస్కర్ ఎంఎల్ఎ రంగనాథరాజును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్బి రహదారుల విషయంలో ఎటువంటి రాజీ పడకుండా మంచి టెక్నాలజీ, నాణ్యతతో రహదారుల నిర్మాణాలను చేపట్టనునట్లు ఆయన తెలిపారు.



వెంకయ్యనాయుడుతో కళాశాల యాజమాన్యం

'శ్రీ వాసవి'లో త్వరలో గ్రాడ్యుయేషన్

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఆహ్వానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల అటానమస్‌ను సాధించి ఇంజినీరింగ్ రెండో బ్యాచ్ పూర్తయిన సందర్భంగా ఈ నెల రెండో వారంలో నిర్వహించే గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం శనివారం ఉదయం విజయవాడలో వెంకయ్యనాయుడును కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, సెక్రటేరియట్ అండ్ కరెస్పాండెంట్ చల్లంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ జి.రత్నాకరరావు, కళాశాల ఉపాధ్యక్షులు కోట్ల రామకృష్ణారావు, టెక్నికల్ డైరెక్టర్ చక్క అప్పారావు, డైరెక్టర్లు చలంచర్ల మురళి పాల్గొన్నారు.


వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న వంశీకృష్ణంరాజు

ఘనంగా వంశీకృష్ణంరాజు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - పాలకోడేరు


కుముదవల్లి సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, అభిమానులు, ఆత్మీయులు, బంధుమిత్రులు వంశీ కృష్ణంరాజుకు పుష్పగుచ్ఛాలు అందించి భారీ కేక్‌ను కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదిగి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. గ్రామ అభివద్ధికి, గ్రామస్తులు అందిస్తున్న సేవలకు సర్పంచి వంశీకృష్ణంరాజును అభినందించారు. అనంతరం గ్రామంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేసి వంశీకృష్ణమరాజు మాట్లాడారు. గ్రామస్తుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.


పంట పొలాల్లో పూడిక పనులు

'పంట పొలాల్లో పూడిక పనులు వద్దు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

పంట పొలాల్లో ల్యాండ్ కన్‌స్ట్రక్షన్ పేరుతో పూడిక పనులు చేయవద్దని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం పొలమూరు పరిధిలో వెళ్లే రహదారి పక్కన వరి పంట పొలాల్లో లాండ్ కన్వర్షన్ పేరుతో నాలుగు రోజులుగా పూడికలు జరుగుతున్నాయి. దీనిపై విఆర్ఒ శ్రీనివాసరావును వివరణ కోరగా పూడిక పనులకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. అయితే పలు మేజర్, మైనర్ పంచాయతీల పరిధిలో మట్టి పూడికలు జరిగినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఉద్యోగం పొందిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఉద్యోగాలు కల్పించేందుకు 'శ్రీవాసవి' కృషి

తాడేపల్లిగూడెం : తమ కళాశాలల్లో విద్యనభ్యసించిన వారికి ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తున్నామని శ్రీ వాసవి డిగ్రీ, పీజీ కళాశాల ఛైర్మన్ ఎన్వి.రమణరావు తెలిపారు. టిసిఎస్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కళాశాలలో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఉమా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా తమ అధ్యాపకులు పని చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అనేక కంపెనీల్లో తమ విద్యార్థులు మంచి పొజిషన్‌లో ఉన్నారన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

మంచినీటి చెరువు దుర్వాసన

పాలకోడేరు మంచినీటి చెరువులో చనిపోయిన చేపలు

పట్టించుకోని పంచాయతీ అధికారులు

అనారోగ్యానికి గురవుతున్న గ్రామస్తులు


పాలకోడేరులో అపరిశుభ్రంగా, చేపలు చనిపోయి ఉన్న తాగునీటి చెరువు

ప్రజాశక్తి - పాలకోడేరు

మండల కేంద్రమైన పాలకోడేరులో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు కరువైంది. గ్రామంలోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని, మౌలిక వసతులు కల్పించాలని పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు ఎప్పటికప్పుడు గగ్గోలు పెడుతున్నా ఇక్కడ మాత్రం సమస్యలు పరిష్కారం కావట్లేదు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రమాలీల నిర్లక్ష్య వైఖరి కారణంగా కనీసం ప్రజలకు పరిశుభ్రమైన నీరు దక్కడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దుర్వాసన వెదజల్లుతున్న చెరువు

పంచాయతీకి సమీపంలో ఉన్న తాగునీటి చెరువులో చేపలు చనిపోయి, పసర్లు పట్టి చెరువు అంత దుర్వాసన వెదజల్లుతున్నా కనీసం పట్టించుకోవడంలేదు. చెరువులో నీరు అడుగంటినప్పుడు, పసర్లు పట్టినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో తాగునీటిని సరఫరా చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టకుండా విషయం బయటకు పొక్కినప్పుడు మాత్రమే కంటితుడుపుగా చర్యలు చేపడుతున్నారు. కుళాయిలకు సరఫరా చేసే నీరు తాగలేకపోవడంతో గ్రామస్తులు భీమవరం ప్రజలకు తాగునీరు అందించే పైపులు, చెరువు వద్దకు వెళ్లి ప్రతిరోజు నీరు తెచ్చుకుంటూ ఉంటారు. అంత దూరం వెళ్లి రాలేని వారు ఈ నీటిని తాగి అనారోగ్యాల పాలవుతున్నారు. పరిశుభ్రమైన తాగునీరు అందిస్తున్నామని రికార్డుల్లో లెక్కలు రాసుకోవడం తప్ప వాస్తవంగా చేసే ఖర్చుల్లో ఎంతో వ్యత్యాసం ఉన్నట్లు వార్డు సభ్యులే బోర్డు సమావేశాల్లో బహిరంగంగా ఆరోపిస్తున్నారు. పరిశుభ్రమైన నీరు అందించకుండా రూ.లక్షల ఖర్చు చేశామంటూ నిధులు డ్రా చేసుకుని దుర్వినియోగం చేస్తున్నారని దీనిపై జిల్లా స్థాయి అధికారులు విచారణ జరపాలని వారు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రమాలీలను వివరణ కోరగా పంచాయతీ సమీపంలో చెరువులో చేపలు చనిపోవడం వాస్తవమేనన్నారు. మరో చెరువు నీటిని, బోరు నీటిని కలిపి గ్రామస్తులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు.

పొలంలో వరి గడ్డిని కాల్చితే నష్టమే

అంతర్ పంటలు ఉపయోగకరం

రైతులకు సూచిస్తున్న వ్యవసాయాధికారులు


పొలంలో కాలుతున్న వరిగడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

యంత్రం సహాయంతో వరి పంట కోతతో మిగిలిన ఎండు గడ్డిని రైతులు తగలబెట్టడం పరిపాటిగా మారిందని చెప్పవచ్చు. వేసవి తర్వాత చేనులో ఉన్న ఎండుగడ్డి తగలబెడితే పండించే భూమికి, పండే పంటకు నష్టం వాటిల్లడమే కాకుండా కాలుష్యాన్ని కూడా ప్రోత్సహించినట్లు అవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గడ్డిని కాల్చడంతో భూమిలో ఉన్న సారం దెబ్బతినడమే కాకుండా వరి పంటకు అవసరమైన అతి ప్రధానమైన సిలికాన్ మూలకం అందదని అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా గడ్డిని కాల్చడం ద్వారా కాలుష్యం వెలువడుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా రైతులకు సరైన అవగాహన లేక గడ్డిని తగలబెడుతున్నారు. గత 15 సంవత్సరాల క్రితం వేసవి సమయంలో మూడో పంటగా మినుములు, పెసలు ప్రతి రైతు పండించుకుని అపరాల వల్ల కొంత ఆదాయం సంపాదించుకునేవాడు. ప్రస్తుతం అపరాలు, జనుము, జొన్న వంటి వేసవి పంటలు రైతులు పండించుకుంటే తొలకరి వేసుకున్న వరి పంటకు కావాల్సిన భూసారం పూర్తిగా లభించడమే కాకుండా పంట దిగుబడి బాగుండేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అంతర్ పంటలు లేకపోవడంతో పంటకు తగిన భూసారం అందకపోగా, వేసవిలో ఎండు గడ్డిని తగలబెట్టడం వల్ల భూసారం పోవడంతోపాటు, పంటకు కావాల్సిన ఖనిజాలు అందక, ధాన్యం గింజల్లో నాణ్యత ప్రమాణాలు చాలకపోవడంతో రైతు పండించిన పంటకు అంతగా దిగుబడి రాక ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట పొలాల్లో ఉన్న ఎండు తగులబెట్టవద్దని సూచిస్తున్నారు.

చురుగ్గా చెరువు పూడికతీత పనులు


పూడిక తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పండితవిల్లూరు గ్రామంలో మల్లయ్య చెరువు పూడిక తొలగింపు పనులు గత 15 రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. పనులను శనివారం గ్రామ సర్పంచి ఇళ్ల లక్ష్మీచంద్రిక పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత ఐదెకరాల విస్తీర్ణం ఉన్న మల్లయ్య చెరువులో పూడిక తొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు. పనుల్లో ప్రతిరోజు పండితవిల్లూరు, తూర్పుపాలెం, మిని మించిలిపాడు గ్రామాలకు చెందిన దాదాపు 250 మంది కూలీలు పాల్గొంటున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువు మధ్యలో నీళ్లు నిలిచిపోయాయని అందుకే పంచాయతీ నిధులతో వేగవంతంగా చెరువు మధ్య భాగంలో పూడిక తొలగింపు పనులు నిర్వహించేలా కృషి చేస్తున్నట్లు సర్పంచి తెలిపారు. సొసైటీ ఛైర్మన్ గెద్దాడ ఏకలవ్య, ఉపసర్పంచి సదమల్ల వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.పద్మావతి, ఎన్ఆర్ఇజిఎస్ టి ఎ వి సుదర్శన్‌కుమార్ చెరువు పూడిక తొలగింపు పనులు పరిశీలించారు.

ఛాంబర్స్ కళాశాల, టెక్ఇన్ ఐటీ సంస్థ మధ్య ఒప్పందం


ఒప్పందం చేసుకుంటున్న కళాశాల, టెక్ఇన్ ఐటీ సంస్థ

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల, ప్రముఖ ఉద్యోగ శిక్షణ, ఉద్యోగ కల్పనా సంస్థ టెక్ఇన్ ఐటి కంపెనీ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరిందని కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు తెలిపారు. ఈ ఒప్పందం వల్ల ఛాంబర్స్ కళాశాల విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యాలు, వెబ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మిషన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్ స్కిల్స్ వంటివి నైపుణ్యాల్లో తర్ఫీదు పొందడం ఉద్యోగ అవకాశాలను టెక్ఇన్ ఐటీ సంస్థ కల్పిస్తుందని కంపెనీ సిఇఒ శ్రీనివాస్ ఒప్పందపత్రంపై సంతకం చేసినట్లు చెప్పారు. ఈ ఒప్పందం విద్యార్థులకు ఒక శుభపరిణామమన్నారు. విశ్వవిద్యాలయం నిర్దేశించిన సిలబస్‌తో పాటు ఉద్యోగ నైపుణ్యాలు అదనంగా నేర్చుకోవడం వల్ల ఛాంబర్స్ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకుంటారని చెప్పారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయోగపడే బృహత్తర కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే నూతన విద్యా విధానంలో భాగంగా తమ విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్స్ గవర్నింగ్ బాడీ మెంబర్ ఇనుకొండ రంగారావు, కళాశాల ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

12న జనన్న విద్యాకానుక అందజేత


పాఠశాలలకు పంపేందుకు సిద్ధం చేస్తున్న పుస్తకాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తొలిరోజే జగనన్న విద్యా కానుక అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రవిశంకర సర్కార్ శనివారం తెలిపారు. మొగల్తూరు మండలంలోని ప్రాథమిక పాఠశాలలు 68, ప్రాథమికోన్నత పాఠశాలలు ఐదు, ఉన్నత పాఠశాలలు పది ఉన్నాయన్నారు. గత విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతున్న విద్యార్థులతో పాటు కొత్తగా చేరే విద్యార్థులను అంచనావేసి సుమారు 5400 మంది విద్యార్థులకు కిట్లను సిద్ధం చేశామన్నారు. మొగల్తూరు మండలానికి సంబంధించి మొగల్తూరులో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారని, మండలంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అందించేందుకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బూట్లు, సాక్స్, బెల్ట్, బ్యాగ్, యూనిఫాంలను ఆయా పాఠశాలలకు చేరవేయడం దాదాపుగా పూర్తి చేశామన్నారు. ఈ నెల 12వ తేదీన సిఎం జగన్ జగనన్న విద్యా కానుక పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయా పాఠశాలలో విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

నేడు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి - ఆచంట

టిడిపి ఆచంట మండల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య శనివారం తెలిపారు. ఈ సమావేశానికి టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సమావేశానికి సమన్వయ కమిటీ, మండల కమిటీ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైసిపి అసమర్థత వల్లే విద్యుత్ సంక్షోభం : టిడిపి

ప్రజాశక్తి - తణుకు

వైసిపి ప్రభుత్వం అసమర్థత వల్లే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం రాధాకృష్ణ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ రంగం సమస్యలు ఎదుర్కొందని, ఆ సమస్య నుంచి చంద్రబాబు నాయుడు మిగులు విద్యుత్ వరకు తీసుకెళ్లారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచారన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డికి చెందిన షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీ నుంచి కొనుగోలు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ నాణ్యత లోపించిందని ఆరోపించారు. ఒకపక్క సమయపాలన లేని విద్యుత్ కోతలు మరోపక్క ఛార్జీల పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో రూ.4.75 పైసలకు విద్యుత్ కొనుగోలు చేస్తే వైసిపి ప్రభుత్వం వచ్చాక రూ.ఎనిమిదికి కొనుగోలు చేస్తున్నారన్నారు. గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతులను బెదిరించి మీటర్లు పెడుతున్నారని, అధికారంలోకి వస్తే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ రోజుకు మూడు గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం ఉచిత విద్యుత్ ఎస్‌సి కాలనీలకు వర్తిస్తుందని చెప్పడం అన్యాయమన్నారు. మిగులు విద్యుత్‌తో ఉన్న రాష్ట్రాన్ని లోటు విద్యుత్ వరకు తీసుకెళ్లిన ఘనత సిఎం జగన్‌కి దక్కుతుందన్నారు. విద్యుత్ కోతలు నివారించి నాణ్యమైన విద్యుత్ అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాలకొల్లు : రాష్ట్రంలో విద్యుత్ కోతలు, ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం, ప్రభుత్వ దోపిడీపై మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి తీవ్రంగా విమర్శించారు. శనివారం టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలో విద్యుత్ రంగం నిర్వీర్యమైందని, విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. టిడిపి హయాంలో విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసి దేశంలో మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రంగా ఎపిని నిలిపామని తెలిపారు. 2014లో 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉంటే 2019 నాటికి మిగులు విద్యుత్ సాధించామని చెప్పారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కనీసం 3-4 గంటల విద్యుత్ కూడా అందడం లేదన్నారు. టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు కోడి విజయ భాస్కర్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిస్కమ్‌ల వద్ద యూనిట్ ధర రూ.4.75 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.8.77లకు వైసిపి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దీంతో 2019-2022 మధ్య ఏడాదికి రూ.ఆరు వేల కోట్ల అదనపు భారం ప్రజలపై పడుతుందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్నాల రాంపండు, పరిమి, పోతుల అన్నవరం, రవికుమార్, కీలపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

ఘనంగా సింహాచలం పుట్టినరోజు వేడుక


ప్రజాశక్తి - ఉండి

ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ మాజీ సర్పంచి, వైసిపి జిల్లా కార్యదర్శి మునుకోలు సింహాచలం పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఆర్‌పి అగ్రహారం బిసి కాలనీలో అభిమానులు కేక్ కట్ చేసి శాలువాతో సన్మానం చేసి మిఠాయి తినిపించారు. అనంతరం ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన తన కార్యాలయంలో మిత్రులు, శ్రేయోభిలాషులు, వైసిపి నేతల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు అమెరికా శివ నాగరాజు, ఇల్లాపు అప్పాజీ, బైరెడ్డి గణపతి, బురిడీ వీర్రాజు, బురిడీ జ్ఞాన భాస్కరరావు, బురిడీ కేశవ, బురిడీ లోకనాథం, దొండ వెంకటేష్, పాతిరి శివ, బురుగుబెల్లి బాబురావు, కొత్తకోట అనిల్ పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 21, 22 తేదీల్లో తణుకులో నిర్వహించనున్న సిపిఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శనివారం భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.అప్పలస్వామి అధ్యక్షత వహించగా భీమారావు మాట్లాడారు. జిల్లా స్థాయి సిపిఐ రెండు రోజుల శిక్షణ శిబిరంలో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శులు, పట్టణ, మండల కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ, సమితి సభ్యులు, ప్రజా సంఘాల ముఖ్య నాయకులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని కోరారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో నరసరావుపేట పేటలో జరుగనున్న రైతు సదస్సులో జిల్లా నుంచి అధికసంఖ్యలో రైతులు పాల్గొనాలన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గుంటూరులో జరుగనున్న అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్)రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొనాలని కోరారు. బిజెపి తొమ్మిదేళ్ల పాలనలో ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలో ఏకైక పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ, రాష్ట్ర ప్రజల తలమానికం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని సైతం ప్రయివేటీకరణకు పూనుకున్న బిజెపి కేంద్ర మంత్రులకు రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక అర్హత లేదన్నారు. ఈ నెల 11న కేంద్ర మంత్రి అమిత్ షా విశాఖ పర్యటన రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో నిరసించాలని పిలుపునిచ్చారు. చించినాడలో 70 ఏళ్లుగా 400 వందల మంది దళిత కుటుంబాలు బి-ఫారం పట్టాలు పొంది సాగు చేసుకుంటున్న 60 ఎకరాల పెరుగులంక భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు దారుణమన్నారు. తక్షణమే మట్టి తవ్వకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బొద్దాని నాగరాజు, చెల్లబోయిన రంగారావు, కళింగ లక్ష్మణరావు, నెక్కంటి క్రాంతికుమార్, జిల్లా సమితి సభ్యులు మండల నాగేశ్వరరావు, నామాన వెంకటేశ్వరరావు, కె.రమేష్, సిహెచ్.సుందర్, బొద్దాని కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడానికి మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ అందించే కార్యక్రమం గ్రామాల్లో కొనసాగుతుందని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు చెప్పారు. మండలంలోని వల్లూరు, అప్పన్నపేట, మొయ్యేరు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ గ్రామాల్లో చలివేంద్రాలతో పాటు మొబైల్ వ్యాన్ ద్వారా బాటసారులకు, ఎండలో పనిచేసే కూలీలకు మజ్జిగ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి గంగుమొలు చినరత్తయ్య, జోగేశ్వరరావు పాల్గొన్నారు.